క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ



రోగులకు రొట్టె, గుడ్డు అందజేస్తున్న దృశ్యం

డోన్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులకు వైఎస్‌ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చేపట్టే రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ కొనసాగింది. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఎల్లయ్య, ఫకృద్దీన్, సూపర్‌వైజర్ భారతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై సమావేశం



మాట్లాడుతున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్ సిబ్బంది, గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సీఐ ప్రియతం రెడ్డి సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఉన్న పోలీసు కేసుల వివరాలపై సీఐ ఆరాతీశారు. ఇరువర్గాలు రాజీ అయ్యే మార్గం ఉంటే లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చూడాలని సీఐ సూచించారు. గ్రామాల్లో శాంతియువ వాతావరణం నెలకొనేలా చూడాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ లింగమయ్య, పోలీస్ సిబ్బంది బాలజీ సింగ్, రఘుబాబు, దస్తగిరి,నాగరాజు పాల్గొన్నారు.

8న మీరాపురంలో పెద్దమ్మ దేవర



బనగానపల్లె రూరల్: మండలంలోని మీరాపురంలో ముప్పైఏళ్ల తర్వాత ఈ నెల 8న పెద్దమ్మ దేవర వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. జాతరలో భాగంగా 7వ తేదీన రాత్రి పెద్దమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. 8న భక్తులు అమ్మవారికి భోనాల సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటామన్నారు.

గర్భిణులకు నూతన వస్త్రాల పంపిణీ



గర్భిణులకు వస్త్రాలు అందజేసిన దృశ్యం

డోన్ : స్థానిక తారకరామనగర్ పార్కులో ఆదివారం అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు ఆర్‌టీసీ శాంతి దాతలు పూర్ణ రవిశంకర్‌రెడ్డి, వసంత గంగిరెడ్డి దంపతుల సహకారంతో గర్భిణులకు నూతన వస్త్రాలతో పాటు ఆర్థిక సాయం చేశారు. అనంతరం దాతలను ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరమేశ్వరమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు రాజా సుజాత, శారద, సుమిత్ర రాజేష్, లక్ష్మి, సరోజమ్మ, అనంతలక్ష్మి, షాలిని, అనురాధ, సుధ, శారద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

డోన్ టౌన్: నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ పరీక్షలు ఆదివారం ప్రశాతంగా జరిగాయి. స్థానిక పాతపేట హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో రెండు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో రెండు కేంద్రాలకు కలిపి 384 మంది విద్యార్థులకుగాను 362మంది, బాలికల హైస్కూల్‌లో 437 మందికిగాను 422 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరిడెంట్లు వెంకటసుబ్బారెడ్డి, రామనర్సప్ప, మైమున్నీసా, ప్రసాద్ తెలిపారు.

శ్రీ చౌడేశ్వరీదేవికి ఘనంగా సహస్రదీపాలంకరణ సేవ



బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో కొలువైన అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవ ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి సహస్రదీపాలంకరణ సేవా కార్యక్రమాన్ని భక్తుశ్రద్ధలతో నిర్వహించారు.

కన్వీనర్లు, గృహసారథులదే కీలకపాత్ర

- సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై విస్తృత ప్రచారం చేయాలి
- ప్రతిపక్ష పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి
- రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రామసుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: గ్రామ సచివాలయ వలంటీర్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన కన్వీనర్లు, గృహసారథులదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలకపాత్ర అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని వీరభద్ర ఫంక్షన్ హాలులో మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకుడు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ల మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పరిపాలనను గ్రామ స్థాయిలో వికేంద్రీకరణచేసి నవరత్నాల ద్వారా ప్రజల ఇంటిముంగిటకే సంక్షేమ పథకాలను తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను దేశమంతా కీర్తిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని గ్రామ వలంటీర్లతోపాటు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు దోచుకుని పంచుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో గత మూడున్నరేళ్లగా చేపట్టిన అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి కన్పించలేదా అని నిలదీశారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు కీలకంగా వ్యవహరించి 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశానికి హాజరైన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

టీడీపీ కుట్రలను తిప్పికొట్టాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రతిపక్ష టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకుడు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క హామీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. ప్రభుత్వంపై పనిగట్టుకుని టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్వీనర్లు, గృహసారథుల నియామకంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిగిలిపోయిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భూస్థాపితం చేశారని, వచ్చే నెల లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు సైతం టీడీపీ అభ్యర్థులు భయపడేలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీర్పు నివ్వాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీవీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, బూస భాస్కర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, దేవరాజు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు కనకాద్రిపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు మధ్యాహ్నం 3గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఈకార్యక్రమానికి హాజరవుతారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు సంజామలలో సమీక్షా సమావేశం

కోవెలకుంట్ల: సంజామల మండలం గిద్దలూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామ వలంటీర్లకు అనుసంధానం నియమించిన గృహసారథులు, కన్వీనర్ల బాధ్యతలు, రాబోయే రోజుల్లో వారు చేపట్టాల్సిన అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ జిల్లా పరిశీలకుడు రామసుబ్బారెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ అఫ్జల్‌ఖాన్, జిల్లా అబ్జర్వర్ అమర్నాథరెడ్డి తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రబృంద సభ్యుడు ప్రదీప్ కుమార్

కోవెలకుంట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ వర్తింపచేయాలని కేంద్ర బృంద సభ్యులు ప్రదీప్‌కుమార్ పైత్రే, సంతోష్‌కుమార్ ప్రధాన్ అధికారులకు సూచించారు. ఆదివారం మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో కేంద్ర బృందం పర్యటించి వివిధ పథకాలకు సంబంధించిన వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా అందుతున్న రుణాలు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు, పంచాయతీరాజ్, హౌసింగ్ తదితర పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు మాట్లాడుతూ ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీలకు గరిష్ట వేతనం అందేలా ఉపాధి సిబ్బంది పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఉపాధి పథకం ఏపీడీ సాంబశివరావు, ఏపీఓ శ్రీవిద్య, ఈఓపీఆర్డీ రాధిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, దేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

విద్యార్థిని వైద్యఖర్చులకు ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న గురుకుల పాఠశాల సిబ్బంది

ప్యాపిలి: మండల పరిధిలోని ఊటకొండ గ్రామానికి చెందిన జయరాముడు, లక్ష్మీదేవిల కుమార్తె విద్యార్థిని సిరి కృష్ణగిరి మండలం కంబాలపాడు గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా సిరి అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కర్నూలు విశ్వభారతి హాస్పిటల్‌లో చేర్పించారు. విషయం తెలుసుకున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, డీసీఓ శ్రీదేవితో పాటు వసతిగృహ విద్యార్థినులు కలిసి రూ. 50 వేలు సమకూర్చారు. ఈ మేరకు వారు సమకూర్చిన మొత్తం చెక్కును ఆదివారం విద్యార్థిని తండ్రి జయరాముడికి అందజేశారు. గురుకుల పాఠశాల సిబ్బందికి విద్యార్థిని తండ్రి కృతజ్ఞతలు తెలిపాడు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

- ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్న నాలుగు రోజులకే మృత్యువాత



ఎస్‌ఎండీ గౌస్(ఫైల్)

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎస్‌ఎండీ గౌస్(60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి డిపో పరిధిలోని వైఎస్సార్‌జిల్లా కొండసుంకేసులకు నైట్‌హాల్ట్ బస్ సర్వీసుకు వెళ్లాడు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున బస్సు తిరుగు ప్రయాణం కాగా సంజామల మండలం మిక్కినేనిపల్లె బస్టాఫ్‌కు చేరుకునే సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో బస్‌ను పక్కకు ఆపి స్టీరింగ్‌పై పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు క్రిందకు దించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది డ్రైవర్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈయన 30 ఏళ్లపాటు ప్రమాద రహిత డ్రైవర్‌గా ఎంపికై ఈ నెల 2వ తేదీన జిల్లాస్థాయి ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్నారు. అవార్డు దక్కిన నాలుగు రోజుల్లోనే మృతువాత పడటంతో డిపోలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. డ్రైవర్ మృతిపట్ల డిపో మేనేజర్ తిరుపతయ్య, యూనియన్ నాయకులు శివరాం, డీడీ గిరి తదితరులు సంతాపం తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను ఆదివారం ఆయన స్వగృహంలో చేపట్టారు. దాతల సహకారంతో 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తన సొంత నిధులతో ప్రతి నెలా పేదలకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, ఎల్‌ఐసీ ఏజెంట్ శ్రీనివాసరెడ్డి, మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఆంజనేయస్వామి కొండపై సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు

డోన్ : స్థానిక తిరుమల వీరాంజనేయస్వామి కొండపై మాణిక్యప్రభు సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సీతారామచంద్రస్వాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైఎస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ పర్యవేక్షణలో 108 జంటలు, భక్తుల సమక్షంలో వేద మంత్రాలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మణకుమార్ నిర్వహించారు. అంతకుముందు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణాంజనేయులు గౌడ్, మాణిక్యప్రభు సేవాసమితి అధ్యక్షుడు కొట్రికె సురేష్, కార్యదర్శి మాకం ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మురారి నరసింహయ్య, మాధవరెడ్డి, సహాయ కార్యదర్శులు జక్కా మధుసూదన్, గోవింద్‌రెడ్డి, సమన్వయ కర్తలు కిషన్‌సింగ్, మీసేవా శ్రీరాములు, కమిటీ సభ్యులు శేషన్నగౌడ్, ఒంటెద్దుబండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామికి కల్యాణం

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమాన్‌పురంలో వెలసిన కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం గ్రామోత్సవం చేపట్టారు. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామ రైతు సంఘం, దాతల సహకారంతో జిల్లాస్థాయి నాలుగు పండ్లలోపు వృషభరాములకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొంది వృషభరాజముల యాజమాన్యలకు దాతలు, గ్రామ వైఎస్సార్ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, సూర్య ప్రకాశ్ చేతుల మీదుగా వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6వేలు, రూ.5 వేలు, రూ, 3 వేలు చొప్పున బహుమతులను అందజేశారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లెలో టీటీడీ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించిన నూతన ఆలయంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, వైస్ ఎంపీపీ రంగస్వామి, కౌన్సిలర్ మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, నాగరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ రాయలసీమ ధర్మ ప్రచారక్ ఈశ్వర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మాధవరెడ్డి, సహాయ కన్వీనర్ నాగ మోహన్‌రెడ్డి, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బాలీశ్వర్‌రెడ్డి, దేవాలయాల జిల్లా ఇన్‌చార్జ్ రవి శంకర్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పుట్టపెద్దమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బేతంచెర్ల : స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మ బోనాల జాతర మాఘ శుద్ద పౌర్ణమి ఆదివారం వైభవంగా జరిగింది. పాత కూరగాయల మార్కెట్ నుంచి బోయపేట, కొత్త బస్టాండు, పాతబస్టాండు, హనుమాన్ నగర్, సంజీవనగర్ కాలనీల మీదుగా ప్రత్యేకంగా అలంకరించి పుట్టపెద్దమ్మ ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త బుగ్గన సంజీవరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న యాగంటిపల్లె మహిళా టైలర్లతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: మహిళల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. చేతి వృత్తుదారులైన పేదలకు చేదోడు పథక కింద నేరుగా నగదు అందజేస్తూ సీఎం అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. చేదోడు పథకం కింద లబ్ధిపొందిన మండలంలోని యాగంటిపల్లెకు చెందిన 125 మంది మహిళా టైలర్లు ఆదివారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొటోకు పాలాభిషేకం చేశారు. స్థానిక పొదుపు భవనంలో సర్పంచ్ బండివరలక్ష్మి, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బండి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో కలిసి సీఎం ఫొటోకు పాలాభిశేకం చేశారు. అనంతరం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఏ రాష్ట్రాల్లోనూ ఏ సీఎం అమలు చేయని పథకాలను వైఎస్ జగన్ అమలు చేస్తూ బడుగు, బలహీనవర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేని ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు పసలేని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరి ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని, మళ్లీ జగనన్నను సీఎం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ కళాధర్‌రెడ్డి, యామ సుధాకర్‌రెడ్డి, సామన్నగారి కృష్ణమోహన్ రెడ్డి, బత్తుల శివశంకర్‌రెడ్డి, ఎస్ శివప్రసాద రెడ్డి, ఎస్ శ్రీనివాసరెడ్డి, వై.సర్వేశ్వరరెడ్డి, వై బ్రహ్మానందరెడ్డి, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బుగ్గన స్వగృహానికి వందేళ్లు!



బేతంచెర్లలో అంలంకరించిన మంత్రి బుగ్గన స్వగృహం

బేతంచెర్ల: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహం వందేళ్లు పూర్తి చేసుకుంది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జేజీనాయన రావు బహదూర్ బీపీ శేషారెడ్డి హయంలో 1923లో ఈ గృహాన్ని నిర్మించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ ఇల్లును సుందరంగా అలంకరించారు. కుటుంబ సభ్యులు హోమాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. నేటికీ చెక్కుచెదరని ఈ భవనాన్ని చూసి రాజుల కాలం కట్టడాలతో పోల్చుతున్నారు స్థానికులు.

అన్నదానం



పేదలకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: డోన్ డివిజన్ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో పేదలకు అన్నదానం చేశారు. రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించిన కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు ఆదాం,ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జాన్సన్‌బాబు, సహాయ కార్యదర్శి శ్యాముల్, కోశాధికారి యిర్మియా, సభ్యులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ఆధ్వర్యంలో : స్ఫూర్తి సభ్యులు దాతల ఆర్థిక సాయంతో ఆశ్రమాల్లోని వృద్ధులు, పట్టణంలోని యాచకులకు అన్నదానం చేశారు. తెలంగాణ రాష్ట్రం షాద్‌నగర్‌కు చెందిన దాత లక్ష్మీశెట్టి రమేష్ ఆర్థిక సాయంతో పట్టణంలోని యాచకులకు అల్పాహారం అందజేశారు. అదేవిధంగా పట్టణానికి చెందిన దివంగత బోయ బసన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుల ఆర్థిక సాయంతో స్థానిక హోసన్నా, ఓబులాపురం శ్రీకాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు ఆలా మధు, చంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు పురస్కారాలు

బేతంచెర్ల: ఉమ్మడి జిల్లా కర్నూలు జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో ఆదివారం జరిగిన సావిత్రి బాయి పూలే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూలు మహిళా ఉపాధ్యాయులు మహేశ్వరి, గోవిందమ్మ పురస్కారాలు అందుకున్నారు. కడప ఆర్జేడీ ప్రతాప్ రెడ్డి, కర్నూలు, నంద్యాల డీఈఓలు రంగారెడ్డి, అనురాధ, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వేణుగోపాలు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కరుణానిధి వారికి సావిత్రి బాయి పూలే ఉత్తమ మహిళా ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. మహేశ్వరి, గోవిదంమ్మలను హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం రాజశేఖర్ రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ఇద్దరి పరిస్థితి విషమం



మృతి చెందిన శివ

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన శివ(42) అనే వ్యక్తి మృతి చెందాడు. నాగులయ్య, శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...కొచ్చెర్వుకు చెందిన నాగులయ్య తన పొలానికి వెళ్లి తిరిగి గ్రామానికి సైకిల్‌పై వస్తున్నాడు. ప్యాపిలి మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన శివ, శ్రీనివాసులు సొంత పని మీద డోన్‌కు వచ్చి తిరిగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. కొచ్చెర్వు వద్ద సైకిల్‌పై వెళ్తున్న నాగులయ్యను వెనుక నుంచి వేగంగా మోటారు సైకిల్ ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ముగ్గురు రోడ్డుపైన పడిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివ అనే వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాగులయ్య, శ్రీనివాసులుల పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.